I

సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025

ఇంజనీర్ల ఇలాకా..

అదో మారుమూల గిరిజన తండా. వారికి తెలిసిందల్లా కూలి పని చేయడమే. రెక్కలు ముక్కలు చేసుకొని కుటుంబాలు వెళ్లదీసుకుంటారు. మేము పడే కష్టం మా పిల్లలు పడకూడదని కష్టపడి చదివించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన గిరిజనులు అదే దారిలో వెళ్లారు. ఒక్కొక్కరు ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తూ ఇతర తండాలు, గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు కంగ్టి మండలంలోని జమ్గి(బీ) సాధు తండా యువకులు. ఏకంగా ప్రభుత్వ కొలువుల్లో 40 మంది ఉండగా.. ఇందులో 20 మంది ఇంజనీర్లే కావడం విశేషం.

– కరణం సుదర్శన్ రావు, కంగ్టి(నారాయణఖేడ్):



వివరాలు II లో..

న్యూస్‌రీల్

పోయింది అధికారం మాత్రమే

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ పార్టీకి పోయింది అధికారం మాత్రమేనని ప్రజల గుండెల్లో ఉండేది గులాబీ జెండానే అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ఎస్‌గార్డెన్‌లో బీఆర్‌ఎస్ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ...బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 27న హన్మకొండలోని ఎలకతుర్తిలో నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో రజతోత్సవ సభ గురించి ప్రజలకు వివరించి వాల్ పోస్టర్లు అతికించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు,కార్యదర్శి అరిఫొద్దిన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సుధీర్‌రెడ్డి, మల్లాగౌడ్, తాజా మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

హోప్ ఆస్పత్రికి రూ.50 వేల జరిమానా

సంగారెడ్డి: నిబంధనలు పాటించకుండా వైద్యం చేసి ఓ వ్యక్తి మృతికి కారణమైన సంగారెడ్డిలోని హోప్ న్యూరో ఆస్పత్రికి రూ.50 వేల జరిమానా విధించడంతోపాటు నోటీసులు అందించారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి శనివారం మీడియాకు వివరించారు. కోహీర్ మండలం పైడి గుమ్మల్ గ్రామానికి చెందిన నవీన (37) హోప్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 2న మరణించాడు. ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 4న ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. ఇందులోభాగంగా నిబంధనలు పాటించకుండా వైద్యం చేసినట్లు విచారణలో తేలింది. మరో ఐదు రోజుల్లో రోగి మృతికి సంబంధించి పూర్తి వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొనట్లు ఆమె వెల్లడించారు.

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

సంగారెడ్డి టౌన్: రైతులు పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలంలో శనివారం రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంట పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక సాంద్రత పద్ధతిలో వేసిన పంటలను సాగు చేస్తే మేలైన దిగుబడి ఉంటుందని మంచి లాభాలు వస్తాయన్నారు. రైతులకు పత్తి సాగులో మెళకువలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త కోఆర్డినేటర్ రాహుల్ విశ్వక్, మండల అధికారి ఝాన్సీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

27న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 27న నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆరో తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. విద్యార్థులు ఆన్లైన్లో telanganams.cgg.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మండుతున్న ఎండలు

42డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పలుచోట్ల ఉష్ణోగ్రతలు 41డిగ్రీలు దాటి 42కు చేరువలో నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బయటకు రావడానికి జంకుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకురావటం లేదు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఇళ్లలో ఉక్కబోతకు భరించలేకపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో విద్యుత్తు సరఫరా లేని సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో శనివారం 16 మండలాలల్లో 40కి పైగా ఉష్ణోగ్రతలు నమోదైంది. అత్యధికంగా సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్‌లో 41.8డిగ్రీలు నమోదు కాగా అత్యల్పంగా మునిపల్లి మండల పరిధిలోని కంకోల్‌లో నమోదైంది.





సంగారెడ్డిలో ర్యాలీలో పాల్గొన్న నిర్మలారెడ్డి, క్రైస్తవులు



జహీరాబాద్‌లో నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్న చంద్రశేఖర్, క్రైస్తవ సోదరులు

రన్ ఫర్ జీసస్

సంగారెడ్డి/జహీరాబాద్ టౌన్/పటాన్‌చెరు టౌన్: ఈస్టర్ పర్వదినం సందర్భంగా శనివారం జిల్లాల్లో పలు ప్రాంతాల్లో 'రన్ ఫర్ జీసస్'పేరుతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో ర్యాలీని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రూబెన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్,మధు,వినయ్ రాజ్,ప్రధాన కార్యదర్శులు, సునీల్ జయకుమార్,సోలమన్‌తోపాటు నియోజకవర్గంలోని అన్ని చర్చిల పాస్టర్లు, యువత,మహిళలు,పిల్లలు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఇక జహీరాబాద్ పట్టణంలో మెథడిస్టు చర్చ్, క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మాజీమంత్రి చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీని స్థానిక రాజకీయ నాయకులు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మైత్రి గ్రౌండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పాల్గొని సందేశం వినిపించారు.



సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తూ!

నిమ్జ్ కోసం భూసేకరణ సరే..పరిశ్రమలేవీ..?

- భూములు కోల్పోయి దశాబ్దం గడుస్తున్నా..
- ఉపాధి దక్కేదెన్నడంటున్న నిర్వాసితులు..
- ఇప్పటికే సేకరించిన భూములు 5,109 ఎకరాలు..
- తాజాగా 941 ఎకరాల సేకరణకు మరో నోటిఫికేషన్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నిమ్జ్ (జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి) భూసేకరణ తీరు విమర్శలకు దారితీస్తోంది. ఈ నిమ్జ్ కోసం దశాబ్ద కాలంగా వందల ఎకరాల భూములు సేకరిస్తున్నారు. కానీ, ఇప్పటికీ ఈ నిమ్జ్‌లో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఉత్పత్తిని ప్రారంభించలేదు. భూములు పొందిన ఒకటీ రెండు పరిశ్రమలు కూడా కనీసం వాటి నిర్మాణం పనులకు కూడా శ్రీకారం చుట్టలేదు. అయితే భూముల సేకరణ ప్రక్రియ మాత్రం నిరాటంకంగా కొనసాగుతోంది. తాజాగా న్యాల్‌కల్ మండలం హుస్సెల్లీలో 653 ఎకరాలు, హద్నూరులో 288 ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం మరో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇలా ఈ నిమ్జ్ కోసం వందలాది మంది రైతులు భూములు కోల్పోతున్నప్పటికీ.. తమకు కనీస ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రం రావడం లేదని నిర్వాసిత రైతులు, రైతు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2014 నుంచి కొనసాగుతున్న సేకరణ

తొలిసారిగా ఈ నిమ్జ్ కోసం 2014లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామం పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెక్కులను 2015లో పంపిణీ చేశారు. అలాగే చీలపల్లి, ఎల్గోయి తదితర గ్రామాల్లో కూడా భూములను సేకరించారు. ఇలా తొలి విడతలో 2,892 ఎకరాలను సేకరించి దాదాపు దశాబ్దం గడిచినా ఒక్క పరిశ్రమ కూడా ఉత్పత్తిని ప్రారంభించలేదు. ఒక్క ఉద్యోగాన్నివ్వలేదు. ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడలేదు. ఉన్న భూములు కోల్పోయి రైతుల పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా తయారైంది.



జహీరాబాద్ వద్ద ప్రతిపాదిత జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్)

12,635 ఎకరాల లక్ష్యం..

మూడు లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..రూ.వేల కోట్ల పెట్టుబడులు అంటూ ఊరిస్తున్న ప్రభుత్వం 2012లో జహీరాబాద్ వద్ద ఈ నిమ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. ఈ నిమ్జ్ కోసం న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల పరిధిలో 17 గ్రామాల పరిధిలో మొత్తం 12,635 ఎకరాల భూములు సేకరించి ఇవ్వాలని టీజీఐఐసీ రెవెన్యూశాఖను అభ్యర్థించింది. తొలివిడతలో సేకరించిన 2,892 లతో రెండో విడతలో సేకరించిన భూములతో కలిపి ఇప్పటి వరకు మొత్తం 5,109 ఎకరాలను తీసుకున్నారు. మిగిలిన 7,526 ఎకరాలను ఇంకా సేకరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తాజా నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ భూసేకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌ను నియమించిన సంగతి తెలిసిందే.

ఏళ్ల తరబడి జాప్యం..

పలు బహుళజాతి కంపెనీలు ఈ నిమ్జ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అంగీకరిస్తున్నాయి. ఈ మేరకు భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమని ప్రకటిస్తున్నాయి. ప్రముఖ వాహనాల ఉత్పత్తి సంస్థ ట్రిటాన్ ఈ నిమ్జ్‌లో రూ.2,100 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినట్లు రెండేళ్ల క్రితం వార్తలు వచ్చాయి. అలాగే రక్షణ రంగ ఉత్పత్తులు చేసే మరో సంస్థ కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని భావించాయి. ఈ మేరకు ప్రభుత్వ పెద్దలతో ఒప్పందాలు చేసుకున్నాయి. కానీ, ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ నిర్మాణం దిశగా శ్రీకారం చుట్టలేదు. ఉత్పత్తిని ప్రారంభించలేదు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు మాత్రం నిర్వాసితులుగా మారుతున్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర

- మంత్రి దామోదర రాజనర్సింహ
- సంగారెడ్డిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డిలో శనివారం జరిగిన కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి దామోదర హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో ఎన్నో రకాల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రజలకు ఏమి కావాలో తెలుసుకుని వారిని ఆదుకునే పథకాలను తీసుకొచ్చే ఉద్దేశంతో రాష్ట్రంలో కులగణన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పార్టీలకు, రాజకీయాలకతీతంగా గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు మొదటి విడతలో ప్రతీ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కల్పన కోసం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాయితీ రుణాలను ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. త్వరలో మరో 20 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్ షెట్కార్ ,టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యతలోపిస్తే జైలుకే

- మంత్రి దామోదర హెచ్చరిక
- అందోలులో కేజీబీవీ, నర్సింగ్ కళాశాలల సందర్శన



అందోలు వద్ద కళాశాలలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే అందుకు బాధ్యులైన వారినందరినీ జైలుకే పంపిస్తామని మంత్రి సి.దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. అందోలులోని ప్రభుత్వ నర్సింగ్, మహిళా పాలిటెక్నిక్ కాలేజీలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల్లో మంత్రి విద్యార్థినిలతో మాట్లాడారు. పాఠశాలల్లో సౌకర్యాలపై ప్రిన్సిపాల్, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ల్యాబ్‌లలో కొత్త కంప్యూటర్లు, డైనింగ్ హాల్‌లో కొత్త టేబుళ్లు, ఇతర సామగ్రి సమకూర్చినందుకు మంత్రికి విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు. ల్యాబ్‌లలో ఏసీలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు కళాశాల నుంచి హాస్పిటల్‌కు, హాస్పిటల్ నుంచి కాలేజీకి వెళ్లడానికి కొత్త బస్సు ఏర్పాటు చేయిస్తానని విద్యార్థులకు మంత్రి హామీ ఇచ్చారు. అందోలులోని 1141 సర్వే నంబరులోని స్థలంలో నిర్మాణంలో ఉన్న 50 బెడ్ల మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం, వంద బెడ్ల ఏరియా హాస్పిటల్, నూతన నర్సింగ్ కళాశాల భవనాలతోపాటు కళాశాల ముందు నిర్మిస్తున్న బస్టాండ్‌లు, ఫోర్‌లైన్ రోడ్డు పనులను మంత్రి పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రి సూచించారు. ఆర్డీఓ పాండు, ఆర్ అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, స్థానికులు మంత్రి వెంట ఉన్నారు.

పత్తి మిల్లులో రూ.59 లక్షలు మాయం

- క్యాషియర్‌పై అనుమానాలు.. పోలీసులకు ఫిర్యాదు

కంగ్టి(నారాయణఖేడ్): పత్తి మిల్లులో రూ.59 లక్షలు మాయమయ్యాయి. కంగ్టి మండలం తుర్కవడగాం శివారులోని సమర్థ్ కాటన్ మిల్లులో జరిగిన ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సమర్థ్ కాటన్ మిల్లు యాజమాని వివేక్, క్యాషియర్ మహదేవ్ అప్పన్న కలసి ఈ నెల 17న కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌బీఐ నుంచి రూ.1 కోటి డ్రా చేసి తెచ్చారు. వీటిలో రూ.18 లక్షలు పత్తి విక్రయించిన రైతులకు చెల్లించారు. రూ.22 లక్షలు పరుపు కింద పెట్టి మరో రూ.59 లక్షలు లాకర్‌లో పెట్టాలని అదే పత్తి మిల్లులో పనిచేసే మరో క్యాషియర్ రాంథాకరే మహదేవ్‌కు సూచించారు. అదే రోజు రాత్రి మిల్లులోనే నిద్రించిన రాంథాకరే ఉదయం లేచి సీసీటీవీల స్విచ్‌లు ఆఫ్ చేసి ఉండటం చూసి అనుమానంతో పరుపు కింద ఉంచిన డబ్బులు చూడగా రూ.22 లక్షలు అలాగే ఉన్నాయి. లాకర్‌లో పెట్టిన రూ.59 లక్షలు మాత్రం కనిపించలేదు. వెంటనే రాంథాకరే మహదేవ్‌ను పిలిచి అడిగాడు. రూ.59 లక్షలు లాకర్‌లో పెట్టినట్లు, డబ్బులు మాయమైన విషయం తనకు తెలియదని చెప్పాడు. డబ్బులు మాయమైన విషయాన్ని యజమాని వివేక్‌కు సమాచారం అందించి క్యాషియర్ మహదేవ్ అప్పన్నపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్యాషియర్ ఆత్మహత్య యత్నం

తాను డబ్బులు దొంగలించకపోయినా తమపై ఫిర్యాదు చేయడంతో అవమానానికి గురైన మహదేవ్ అప్పన్న పత్తి మిల్లు పరిసరాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్తు తీగలను పట్టుకోవడానికి ప్రయత్నించాడు. కాగా విద్యుదాఘాతంతో గాయాలపాలు కావడంతో ఆయనకు ఆస్పత్రికి తరలించారు.

ఊళ్లల్లో ఉపాధి జోరు

39.96లక్షల దినాల కల్పన లక్ష్యం

- గతేడాది లక్ష్యాన్ని మించి పనులు
- రోజురోజుకు పెరుగుతున్న కూలీల సంఖ్య
- పెరిగిన కూలితో కూలీలకు గిట్టుబాటు

సంగారెడ్డి జోన్: గ్రామాలలో వలసలు నివారించి స్థానికంగా ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకోవాలన్నదే ఉపాధి హామీ లక్ష్యం. ఇందులో పని చేయాలని ఆసక్తి కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి జాబ్ కార్డులు మంజూరు చేసి 100 రోజుల పని కల్పిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులతోపాటు మరి ఏ ఇతర పనులు లేకపోవడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు జోరుగా సాగుతున్నాయి. పని ప్రదేశాలు కూలీలతో సందడిగా కనిపిస్తున్నాయి.

నిర్దేశించుకున్న లక్ష్యం మేరకే..

ఉపాధి హామీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 39.96 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గ్రామాల్లో పనులు ప్రారంభించారు. ఈ ఆర్థిక ఏడాదిలో చేపట్టే పనులను గుర్తించేందుకు గతేడాది డిసెంబర్‌లో గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి ఉపాధి పనులను గుర్తించారు. గుర్తించిన పనుల ఆధారంగా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి వాటిని చేపడుతున్నారు. అవసరమైతే ప్రజలు, రైతుల అవసరం మేరకు మరిన్ని పనులు చేపడుతున్నారు.

లక్ష్యాన్ని మించి పనులు

గతేడాది నిర్దేశించిన లక్ష్యానికి మించి ఎక్కువగా పనులు చేపట్టినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. గత ఆర్థిక ఏడాదిలో 49.56లక్షలు నిర్దేశించగా ఈ ఏడాది 50.02లక్షల పని దినాలు కల్పించారు. సుమారు 50 వేల పని దినాలు అదనంగా కల్పించారు.

పెరుగుతున్న కూలీల సంఖ్య

ఉపాధి హామీలో పనులు ప్రారంభించిన నాటి నుంచి రోజురోజుకు కూలీల సంఖ్య పెరుగుతుంది. జిల్లాలో 24 మండలాల్లో 619 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం అమలవుతుంది. జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి పనులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతీరోజు 40 వేలమందికి పైగా పనులకు హాజరవుతున్నారు.

పెరిగిన కూలితో...

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీలో పనులు చేస్తున్న కూలీలకు రూ.7లను అదనంగా పెంచింది. దీంతో కూలి రూ.307లకు పెరిగింది. దీంతో కూలీలకు గిట్టుబాటు లభించినట్లయ్యింది. అంతేకాకుండా కూలీలకు గిట్టుబాటు వేతనం అందేవిధంగా పనులు కల్పిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఝరాసంగం మండలం బొప్పన్‌పల్లిలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుధాకర్, ఏపీఓ రాజ్‌కుమార్

ఉపాధి పథకం వివరాలు

గతేదాది పనిదినాల లక్ష్యం	49.56లక్షలు
గతేదాదిలో పూర్తి చేసిన పనిదినాలు	50.02లక్షలు
ఉపాధిహామీ అమలవుతున్న పంచాయతీలు	619
రోజూ హాజరవుతున్న కూలీల సంఖ్య	42,600

అవగాహన కల్పిస్తున్నాం



సొంత గ్రామంలోనే పని కల్పించటం ఉపాధి పథకం యొక్క లక్ష్యం. ప్రతీ ఒక్కరు పనులకు హాజరయ్యేవిధంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ కూలీకి గిట్టుబాటు అయ్యేవిధంగా ప్రణాళికబద్ధంగా పనులు కల్పిస్తున్నాము. ఉపాధి హామీని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి.

–జ్యోతి, డీఆర్‌డీఏ, సంగారెడ్డి జిల్లా

భూభారతితో సులభతరం

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పుల్‌కల్(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతితో రైతులకు సంబంధించిన భూలావాదేవీలు సులభతరమవుతాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. పుల్‌కల్‌లో శనివారం రైతువేదికలో ఏర్పాటుచేసిన భూ భారతి అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇతర రాష్ట్రాలలో పర్యటించి, మేధావుల, పలు రైతు సంఘాలతో చర్చించి ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిందన్నారు. గతంలోలాగా కాకుండా భూ భారతిలో భూసమస్యలు 30 రోజుల్లో పరిష్కారం అవుతాయని సూచించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలను తనిఖీ చేసి 8,9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ పాండు,తహసీల్దార్ కృష్ణ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.దుర్గారెడ్డి, నాయకులు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక రవాణాపై చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని దూల్మిట్ట తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాలపల్లిలోని మోయతుమ్మెద వాగు నుంచి గ్రామానికి చెందిన మెతుకు రామకృష్ణారెడ్డి, మెతుకు సంజీవ్, తుపాకుల శ్రీనివాస్ అనే వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకున్నామన్నారు. ఒక్కో వాహనానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

మద్దూరు(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన దూల్మిట్ట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తుషాలపురం రమ ఇంట్లో శుక్రవారం రాత్రి వేళ ఫ్రిజ్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు ఎగిసి పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి కూలర్, బట్టలు, ఇతర సామగ్రికి నిప్పంటుకొని కాలిపోయాయి. అదే విధంగా విలువైన డాక్యుమెంట్స్‌తోపాటు ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన నగదు కాలిపోయిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిని రెవెన్యూ అధికారులు శనివారం సందర్శించారు.

ఫామ్ హౌస్‌లపై పోలీసుల దాడి

- 8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): ఫామ్ హౌస్‌లపై పోలీసులు దాడి చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కూచారం, జీడిపల్లి శివారుల్లో ఫామ్ హౌస్‌లపై దాడి చేశాం. ఈ దాడిలో వింటర్ గ్రీన్ ఫామ్ హౌస్‌లో 8 మంది పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నాం. వీరినుంచి పేకముక్కలు, రూ. 11 వేల నగదు, 3 కార్లు, 8 ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

పటాన్‌చెరు టౌన్: ఓ పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డుపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ కథనం మేరకు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల ఉషా కాపర్ వైర్స్ పరిశ్రమలో సదాశివపేట పేటకు చెందిన ఖైరత్ మియా (53) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి పరిశ్రమ గేటు ఎదుట డ్యూటీ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ముఖంపై టవల్ కప్పి విచక్షణ రహితంగా కొట్టారు. దీంతో తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గాయాలతో ఉన్న సెక్యూరిటీ గార్డును చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి, బాధితుడిని చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరుకు తీసుకెళ్లారు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బీడీఎల్ పోలీసులు పేర్కొన్నారు.

కలిసిమెలిసి ఉండాలి

- హంపీ పీఠాధిపతి భారతీ స్వామి



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న భారతీ స్వామి

మిరుదొడ్డి(దుబ్బాక): భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, సనాతన ధర్మం ఎంతో శ్రేష్ఠమైనవని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని అందె గ్రామంలోని శంభుని దేవాలయంలో శనివారం నిర్వహించిన బాణ లింగాభిషేక కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. లింగాభిషేకంలో పాల్గొన్న ఆయన గ్రామంలో ఉన్న అన్ని దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. హిందూ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆచరించినప్పుడే పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందుతాయన్నారు. సమాజంలో ధర్మబద్ధంగా జీవిస్తేనే మోక్షం లభిస్తుందన్నారు. గ్రామాల్లో ఈర్ష, అసూయలు తగ్గించి అందరూ కలిసి మెలసి ఐక్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో స్వదేశీ జాగరణ రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ, శివలింగం, యాదగిరి, సుమన్, పోచయ్య, ప్రవీణ్, కుమార స్వామి, కనకరాజు పాల్గొన్నారు.

ఇంజనీర్ల ఇలాకా..

40 మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో సగం మంది వీరే..



- చదువుకోవడానికి 8 కిలో మీటర్లు వెళ్లే యువత
- వలసలు వెళ్లి చదివించిన తల్లిదండ్రులు
- ఒకరిని చూసి మరొకరు ఉద్యోగాల వైపు అడుగులు
- గతంలో బాహ్య ప్రపంచానికి తెలియని తండా
- నేడు ఆదర్శంగా నిలిచిన కంగ్టి మండలంలో జమ్గి(బీ) సాధు తండా

కంగ్టి(నారాయణఖేడ్): అదో మారుమూల తండా. బాహ్యప్రపంచానికి అంతగా తెలియని గిరిజన తండా. అక్కడేం ఉంటుందనుకుంటే పొరపాటే. తరచి చూస్తే చదువులమ్మకు నమస్కరించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపిస్తోంది. రోడ్డు వసతి ఉన్నా బస్సు ఎరగరు. తీవ్ర సమస్యలుంటే తప్ప అధికారులు సందర్శించిన దాఖాలాలుండవు. తాగునీటి కోసం తంటాలు పడాల్సిన దుస్థితి. సాగు భూములంతగా లేవు. వ్యవసాయ కూలీ పనులు చేస్తేనే పూట గడిచే పరిస్థితి. అలాంటి తండా నుంచి ప్రభుత్వ ఉద్యోగులు బయటకు కొచ్చారు. ఒక్కరి నుంచి మొదలైన ప్రభుత్వ ఉద్యోగం.. ఆ తర్వాత ముగ్గురు.. ఇలా ఒక్కొక్కరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తూ ఇప్పుడు ఆ సంఖ్య 40కి చేరింది. ఒకప్పుడు ఎవరికీ తెలియని కంగ్టి మండలంలో జమ్గి(బీ) సాధుతండా ఇప్పుడు అందరి నోటా వినబడుతుంది.

చదువుకోవడానికి 8 కిలో మీటర్లు

జమ్గి(బీ) సాధుతండాలో పాఠశాల లేదు. మండల కేంద్రానికి 18 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి పిల్లలు చదువుకోవాలంటే నిత్యం ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న తడ్కల్ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లేవారు. తాము పడే కష్టం తమ పిల్లలు పడకూడదని చదివించారు. మొదట 1998లో ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. తండాకు చెందిన 1998లో కే.పండరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఉద్యోగం సాధించాడు. తర్వాత నారాయణ, మోతీరం 2000 సంవత్సరంలో ఒకేసారి ఉద్యోగం సాధించారు. అనంతరం 2004లో కుషాల్ ఇరిగేషన్ ఏఈగా ఉద్యోగం సాధించాడు. ఇలా ఒకరి వెనుక మరొకరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.



ట్రాన్స్‌కో విధుల్లో ఇద్దరు తండా ఇంజనీర్లు

వలసలు వెళ్తే గాని పూట గడవదు

తండాలో 120 ఇల్లు, కుటుంబాలు 152 ఉంటాయి. ఇక్కడ ఉన్న భూములు కూడా సాగు నీటి వసతి లేని ఎర్ర చెలుక భూములే. ఏడాదిలో ఎనిమిది నెలలు చెరకు నరికేందుకు, ఇటుక బట్టీలకు వలసలు వెళ్తే తప్ప బతుకు బండి నడవదు. పిల్లలను బడికి పంపేకంటే కూలీకి పంపితేనే బాగుంటుందని భావించే దుస్థితి. అలాంటి దుర్బర పరిస్థితిలో నుంచి ఏక కాలంలో నలుగురు ఇంజనీర్లను అందించింది ఈ సాధుతండా. అప్పటి నుంచి ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగం వరిస్తుందనే నమ్మకం కల్గింది తండాలోని గిరిపుత్రులకు. ఏకంగా 20 మంది ఇంజనీర్లు అయ్యి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

40 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాల్లో..

ప్రస్తుతం మండలంలో అత్యధిక ఉద్యోగులు ఉన్న తండాగా సాధు తండా పేరొందింది. దాదాపు 40 మందికి పైగా యువతీ, యువకులు పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇందులో దాదాపు 20 మంది ఇంజనీరింగ్ ఉద్యోగులే ఉన్నారు. వీరంతా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే బ్యాంకుల్లోనూ, ఉపాధ్యాయులు గాను, వ్యవసాయాధికారులుగాను, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లోనూ, దేశ సరిహద్దుల్లో సైనికులు గాను విధులు నిర్వహిస్తూ తండా ఖ్యాతిని నలుదిశలకు వ్యాపింపజేశారు. ఇంతే కాకుండా బయోటెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివిన అక్కాచెల్లెళ్లు చైతన్య, సింధూ యూఎస్‌ఏలో స్థిరపడ్డారు. వీరి కుటుంబంలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగాల్లో ఉన్నారు. తండాకు చెందిన రవిందర్ అనే యువకుడు దేశ సరిహద్దులో సైనికుడిగా పని చేస్తున్నాడు. తండాలో ట్రిపుల్ ఐటీ, ఎన్‌ఐటీ, ఐఐటీల్లో సీట్లు పొంది చదువులు కొనసాగిస్తున్నవారు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.



సోలార్ సిస్టం వద్ద హైద్రాబాద్ జిల్లా మేనేజర్‌గా విధుల్లో ఇంజనీర్ పండరి

సాధించాలనే పట్టుదలతో..



మా ఇద్దరు కూతుళ్ల ఒకరు ఎంబీబీఎస్ పూర్తి చేయగా మరో అమ్మాయి ఎన్ఐటీ త్రిచిలో సీటు సాధించింది. తల్లి ఉపాధ్యాయురాలు. దీంతో ఇంటిల్లిపాది ఉద్యోగాలు పొంది ఆర్థిక స్థిరత్వం సాధించే దిశగా ముందుకు వెళ్తున్నాం. మారుమూల తండానుంచి ఇంత పెద్ద ఉద్యోగంలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాను.

కే. పండరి, హైదరాబాద్ జిల్లా మేనేజర్ (టీజీఆర్ఈడీసీఓ)

పోటీతత్వంతో ఉన్నత చదువులు



తండాలో యువకులు ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తితో ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం అభినందనీయం. తల్లిదండ్రులు సైతం పిల్లల చదువుల కోసం ప్రోత్సహించడంతో మా తండావాసులు ఉన్నత స్థాయిలో నిలుస్తున్నారు.

– నారాయణ, ఏఈ ట్రాన్స్‌కో, నారాయణఖేడ్

వలసలు వెళ్లి చదివించారు



మా తల్లిదండ్రులు వలసలు వెళ్లి డబ్బు సంపాదించి మాకు మంచి చదువులు చదివించడంతో మా జీవితాలు మారాయి. మేము మా పిల్లలను సైతం ఉన్నత చదువులకు ప్రోత్సహిస్తున్నాం. తండాలోని యువతలో పోటీతత్వం, పోరాట పటిమ పెరుగుతోంది. ఒక్కొక్కరుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– మోతీరాం, ఏఈ ట్రాన్స్‌కో, మనూరు

మంచి పేరు ప్రఖ్యాతలు గడించాం



సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇరిగేషన్‌లో ఏఈగా ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాను. మా తండా నుంచి యువకులు, విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పడి సాధిస్తుండటంతో మంచి ఖ్యాతి ఉంది. యువకులకు ఉన్నత చదువుల కోసం ప్రోత్సాహం అందిస్తున్నాం.

– కుషాల్, ఏఈ ఇరిగేషన్, నిజామాబాద్

దైవ దర్శనానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

శివ్వంపేట(నర్సాపూర్): దైవ దర్శనానికి వచ్చిన వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో తూప్రాన్- నర్సాపూర్ హైవే పై శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ చింతల్ ప్రాంతానికి చెందిన గొల్ల లోకేశ్ (42) లిఫ్ట్ రిపేర్లు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం చాకరిమెట్లలోని ఆంజనేయస్వామి దర్శనం కోసం ఒక్కడే బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి లక్ష్మాపూర్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

సిద్దిపేట అనారోగ్యంతో..

సిద్దిపేటకమాన్: అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. భువనగిరికి చెందిన ఎండీ నవాజ్ (40) ఏడాదిగా పట్టణంలోని ఓ హోటల్‌లో పని చేస్తూ స్థానికంగా నివాసం ఉంటున్నాడు. కొన్ని నెలల కిందట క్యాన్సర్ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నాడు. దీంతో హోటల్‌లో పని మానేశాడు. అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ రోడ్డు డివైడర్ పక్కన నవాజ్ మృతి చెంది పడి ఉన్నట్లు స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న హోటల్ యజమాని జాకీర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



ఘటనాస్థలంలో లోకేశ్ మృతదేహం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

కౌడిపల్లి(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు శనివారం కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని శేరితండా పంచాయతీ వసురాంతండాకు చెందిన దుంగావత్ గేమ్‌సింగ్(35) కొన్నేళ్లుగా భార్యతో కలిసి గుమ్మడిదలలో ఉంటున్నాడు. 18 తండాలో చిట్టీ డబ్బులు కట్టాలని రూ.40 వేలు తీసుకొని గ్రామానికి వచ్చాడు. రాత్రి తండాకు చెందిన మోహన్, సలాబత్‌పూర్‌కు చెందిన జహీర్‌తో కలిసి మద్యం సేవించాడు. అనంతరం దాబాలో భోజనం చేస్తుండగా గేమ్‌సింగ్ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెదక్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తన భర్త వెంట ఉన్న వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కామారెడ్డి జిల్లాలో చేగుంట యువకుడు మృతి

చేగుంట(తూప్రాన్): ఈత కొట్టడానికి వెళ్లి యువకుడు మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు.. చేగుంటకు చెందిన తిరుపతి సంజయ్ (21) రామాయంపేట మండలం దామర చెరువులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం పక్కనే ఉన్న కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డి గ్రామంలో బంధువులు, స్నేహితులు అంతా కలిసి స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొట్టడానికి వెళ్లారు. స్విమ్మింగ్‌పూల్ లోకి దూకిన సందీప్ తలకు గాయమై ఫిట్స్ రాగా అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సందీప్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కామారెడ్డి జిల్లా బిక్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సంజయ్(ఫైల్)

బట్టలు ఉతకడానికి వెళ్లి మహిళ

రామాయంపేట(మెదక్): చెరువులో మునిగి మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన బొగ్గుల అమృత (40) శుక్రవారం సాయంత్రం బట్టలు ఉతకడానికి గాను సమీపంలో ఉన్న పాండ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఆమె మృతదేహం నీటిలో తేలగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను అడవి పంది ఢీకొని

- ఇద్దరు యువకులకు గాయాలు
- చికిత్స పొందుతూ ఒకరు మృతి

చేగుంట(తూప్రాన్): బైక్‌కు అడవిపంది అడ్డురాగా కిందపడి గాయాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బోంది భాను(18)తోపాటు కనకరాజు ఇద్దరు బైక్‌పై రాజ్‌పల్లి గ్రామానికి వెళ్లి గురువారం తెల్లవారు జామున తిరిగి వస్తున్నారు. మండలంలోని పొలంపల్లి శివారులో అడవిపంది అడ్డు వచ్చి బైక్‌కు తగలడంతో ఇద్దరు కింద పడ్డారు. భానుకు తీవ్ర గాయాలు కాగా, మరో యువకుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. భానును సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు.



సునీల్



రాజేశ్



హర్షవర్ధన్



సిద్ధార్థ

జేఈఈ ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: దేశవ్యాప్తంగా విడుదల చేసి న జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాల్లో గిరిజన గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపించి 26 మంది అర్హత సాధించారు. శనివారం గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో ఫలితాలను సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రాజు అభినందించారు. కళాశాల నుంచి 31 మంది పరీక్షలకు హాజరైతే 26 మంది అర్హత సాధించగా 10 మంది మంచి మా ర్కులు పొందినట్లు చెప్పారు. బీ.సునీల్ (81.98), టీ.రాజేశ్(81.94), జే.హర్షవర్ధన్ (81.72), డీ.సిద్ధార్థ (77.33), బీ.మోక్షజ్ఞ (77.04) మార్కులు సాధించారు. గురుకులాల కేంద్ర కార్యాలయం అందించిన స్టడీ మెటీరియల్ చదువడం ద్వారానే మా విద్యార్థులు ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పేదోడి కడుపు నింపేందుకే సన్న బియ్యం

- గరిబోళ్ల ఆరోగ్యం, ఆత్మగౌరవం పెంచిన కాంగ్రెస్ సర్కార్
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- ముత్తంగిలో దళితుల ఇంట్లో భోజనం



ముత్తంగిలో ఓ ఇంట్లో భోజనం చేస్తున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ప్రతీ పేదోడి కడుపు నింపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో దళిత సోదరుడు విఠల్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనం కుటుంబ సభ్యులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా సన్న బియ్యం పంపిణీతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న పాలనపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనికి ఆ కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల ప్రజలు సానుకూలంగా సమాధానం చెప్పి ఇందిరమ్మ పాలనపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. గతంలో దొడ్డు బియ్యం పంపిణీతో అన్నం తినలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారని మరో పక్క దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి దళారుల దందాకు ఉపయోగపడేవన్నారు. అందుకే నిరంతరం పేదల సంక్షేమం అభివృద్ధి కోసం ఆలోచించే సీఎం రేవంత్ రెడ్డి ప్రతీ పేద బిడ్డ కడుపు నింపాలనే తలంపుతో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ముత్తంగి మాజీ ఎంపీటీసీ గడ్డ యాదయ్య, నాయకులు శ్రీను, అశోక్, సన్నీ యాదవ్, శంకర్, దశరథ్, వెంకటేశ్, శ్రీను, ప్రవీణ్, కాళిదాస్, రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి జోన్: వేసవి కాలం ఉన్నందున గ్రామీణ ప్రాంతాలలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...మూడు నెలల పాటుపంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి నీటి సమస్యను అధిగమించాలన్నారు. ప్రతీ పది రోజులకు ఒకసారి జిల్లాలోని తాగునీటి సరఫరాపై సమీక్ష జరిపి, అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

డ్రైవింగ్ కోసం వెళ్లి వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్ : ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ భరత్ బతుకుదెరువు కోసం ఏడాది కిందట వచ్చి ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తేజ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బస్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 10న సాయంత్రం బస్సు నడపడానికని వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్దకు వెళ్లి అడిగితే అతడికి రావాల్సిన డబ్బులు తీసుకొని వెళ్లిపోయాడని తెలిపారు. భర్త అదృశ్యంపై భార్య రేఖాదేవి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరకు సాగులో నూతన వంగడాలు

జిల్లాలో రైతులు వేల ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. దీర్ఘకాలిక వాణిజ్య పంట కావడంతో సంవత్సరం కాలంపాటు ఒకే పంటపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. పాత రకాలనే సాగు చేయడం, మరో వైపు పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు రైతులు ఎంచుకుంటారు. ప్రస్తుతం జహీరాబాద్ ప్రాంత రైతులు 3102 రకం చెరకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– జహీరాబాద్ టౌన్

- 3102 రకం సాగుపై రైతుల ఆసక్తి
- ఎకరాకు 60 టన్నుల దిగుబడి
- జహీరాబాద్‌లో సుమారు 3 వేల ఎకరాల్లో సాగు
- పెరుగుతున్న పంట విస్తీర్ణం

జహీరాబాద్, సంగారెడ్డి తదితర ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో చెరకు పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన రకాలనే పండిస్తున్నారు. సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావాలి కానీ ప్రస్తుత పరిస్థితుల్లో 25 టన్నులు దాటడం లేదు. అందుకని రైతులు అధిక దిగుబడి ఇచ్చే రకాల సాగుపై మొగ్గు చూపుతుంటారు. జిల్లాలో అధికశాతం కో 86032, కో 808005, 87025, 83ఎ30 తదితర రకాలను పండిస్తున్నారు. వీటిలో చెక్కర శాతంతోపాటు దిగుబడి కూడా వస్తుందని కర్మాగారాల యాజమాన్యాలు వీటినే సూచిస్తున్నారు. పెద్దగా లాభాలు లేకున్నా నష్టం రాదన్న ఉద్దేశ్యంతో తప్పని పరిస్థితుల్లో రైతులు ఈ రకాల పంటను పండిస్తున్నారు.

పెరిగిన 3102 రకం పంట విస్తీర్ణం

జహీరాబాద్ ప్రాంతంలో రెండు, మూడేళ్ల నుంచి కొంత మంది రైతులు అధిక దిగుబడినిచ్చే 3102 కొత్త రకం చెరకు పంటను పండిస్తున్నారు. ఈ రకం పంట అధిక దిగుబడి వస్తుందని సాగుపై మొగ్గు చూపడంతో పంట విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం సుమారు 3 వేల ఎకరాల్లో ఈ రకం చెరకు పంట సాగవుతోంది. అధిక విస్తీర్ణంలో సాగవుతున్న కో 86032, కో 808005 తదితర రకాల చెరకు పంట ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అదే 3102 రకం అయితే 60 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. చెరకు గడలు ఏపుగా పెరుగుతాయి. ఎరువులు, కలుపు మొక్కల నివారణ ఖర్చులు తక్కువగా ఉంటున్నాయని చెప్పారు. కొత్త రకం పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండటంతో విత్తనంకు డిమాండ్ పెరిగి టన్నుకు రూ. 5 వేలు పలుకుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



ఎత్తు పెరిగిన 3102 రకం చెరకు గడలు

లాభాలు వస్తున్నాయి

శాస్త్రవేత్తలు, చెక్కర కర్మాగారం కంపెనీ యాజమాన్యం సూచించిన కో 86032, కో 808005 రకాలకు కొన్ని సంవత్సరాల నుంచి పండిస్తున్నాం. పెట్టుబడులు పెరగడం తప్ప ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. లాభాలు తగ్గడంతో రెండేళ్ల నుంచి 3102 రకం పంటను సాగు చేస్తున్నా. పంట దిగుబడి పెరిగి లాభాలు వస్తున్నాయి. విత్తనం కూడా మంచి డిమాండ్ ఉంది.